

పెండింగ్ కేసుల విచారణ వేగవంతం : ఎస్పి

భీమవరం రూరల్ : పెండింగ్ ఉన్న కేసుల విచారణ వేగవంతం చేయాలని ఎస్పి రవిప్రకాష్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల సత్వర పరిష్కారం, సక్రమ విచారణ కోసం సంబంధిత దర్యాప్తు అధికారులకు ఎస్పి పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లోన్‌యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రి గస్తీ పెంచాలని సూచించారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో ఛార్జిషీట్లు ఆలస్యం లేకుండా ఫైల్ చేసి, కోర్టుల్లో విచారణ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లోని పోలీస్ అధికారులు అన్ని వేళలా విధులకు హాజరవుతూ ప్రజానీకానికి ఎటువంటి ప్రాణాపాయం సంభవించకుండా చూసుకోవాలన్నారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పి సుబ్బరాజు, డిఎస్‌పిలు శ్రీనాథ్, చారి, శరత్ రాజకుమార్, ఎన్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

వణుకుతున్న లంకలు..!

లంక గ్రామాల్లోకి ప్రవేశించిన గోదావరి వరద



యలమంచిలి మండలం దొడ్డిపట్ల వద్ద ఇంటి చుట్టూ చేరిన వరద నీరు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి శనివారం ఉగ్రరూపం దాల్చింది. దీంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మండలంలోని పుచ్చల్లంక, అయోధ్యలంకల్లోని పల్లపు ప్రాంతాలు, భీమలాపురం కాలనీలోకి శనివారం వరద నీరు ప్రవేశించింది. ఆయా లంకల్లో రహదారులు నీట మునిగాయి. పుచ్చల్లంక, భీమలాపురం ప్రధాన రహదారులు నీట మునిగాయి. ఇళ్ల చుట్టూ వరద నీరు చేరుకుంది. పెదమల్లంలోని మాచేనమ్మ ఆలయ ప్రాంగణం, పర్యాటక కేంద్రం, కోడేరులోని అపర కర్మల భవనం చుట్టూ నీరు చేరింది. లంక గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి డి.వీరాస్వామి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ జగన్నాధరావు, ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ పర్యటించారు. పల్లపు ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు హెచ్చరించారు.

నీట మునిగిన పంటలు

కూరగాయ పంటలు నీట మునిగాయి. సీ క్లాస్ భూముల్లో రైతులు పెద్దఎత్తున కూరగాయలు సాగు చేస్తున్నారు. వారం రోజులుగా వరద పెరుగుతూ రావడంతో తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తమలపాకు తోటలతోపాటు అరటి తోటలకూ నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఏటిగట్టు దిగువన ఉన్న లంక గ్రామాల్లోని కొబ్బరితోటల్లో అంతర పంటలు నీట మునిగాయి. పశువుల పాకల చుట్టూ నీరు చేరడంతో రైతులు పశువులను ఏటిగట్టుపైకి తరలించారు. ఇటుక బట్టీలు వరద నీటిలో నానుతున్నాయి. లంక గ్రామాలు వరద గుప్పెట్లో చిక్కుకోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లంక గ్రామాల్లో పాముల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. మండలంలోని పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కర ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

యలమంచిలి: వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చింది. దీంతో మండలంలోని కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి తదితర గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. రాత్రికి మరింత వరద పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కనకాయలంక, పెదలంక గ్రామ ప్రజలకు తాగునీరు, పశువులకు దాణాను అధికారులు పంపిణీ చేశారు.

వందలాది ఎకరాల్లో నారుమడులు మునక

గోదావరి వరద ప్రభావంతో మండలంలోని కాజ, నక్కల డ్రెయిన్లు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. దీంతో గుంపర్రు, ఐలపకుర్రు, చింతదిబ్బ, కాంభొట్లపాలెం, వడ్డిలంక, మేడపాడు, సిరగాలపల్లి, యలమంచిలి, చించినాడ, కాజ తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వేసిన నారుమడులు నీట మునిగాయి. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరదల వల్ల ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు

కలెక్టర్ ప్రశాంతి

వరదల కారణంగా ఏఒక్క బాధితుడూ ఇబ్బంది పడకూడదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, కాజ అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను సందర్శించి వరద ప్రభావిత ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా సహాయ పునరావాస కార్యక్రమాలు అత్యంత సమర్ధవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించామన్నారు. దొడ్డిపట్ల చుట్టుపక్కల గ్రామాల వారికి దొడ్డిపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పెదలంక, కనకాయలంక గ్రామాలకు కోనసీమ జిల్లా తాటిపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 30 మంది గర్భిణులను, దీర్ఘకాలిక వ్యాధితో బెడ్ రెస్ట్ తీసుకుంటున్న ఒక్కరిని మొత్తం 31 మందిని ప్రభుత్వ హాస్పిటళ్లకు తరలించామని చెప్పారు. లంక గ్రామాల్లో ఇబ్బంది పడే వారు ఎవరైనా సరే పునరావాస కేంద్రాలకు తరలిరావాలని కోరారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, గోదావరి డెల్టా ధవళేశ్వరం చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్‌కుమార్, ఇస్ఇ జి.శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి బి.వెంకటరమణ, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, జిల్లా నీటిపారుదల శాఖాధికారి బి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఎ.రామస్వామి, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆచంట మండలంలో..



మార్టేరులో నిరసన ర్యాలీ

మణిపూర్ మారణహోమంపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మణిపూర్ మహిళలను, ప్రజలను రక్షించాలని, బిజెపి ముఖ్యమంత్రిని తొలగించాలని సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం మార్టేరు సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. బిజెపి దుష్ట కౌగిలి నుంచి మణిపూర్‌ను, భారతదేశాన్ని రక్షించుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ఇతర దేశాలకు వెళ్లి భారత ప్రతిష్ట గురించి మాట్లాడే ప్రధాని దేశంలో మహిళల మీద దాడి జరిగితే దాన్ని ఖండించడానికి, దానిమీద మాట్లాడటానికి సిద్ధంగా లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకుని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని తొలగించాలని, మహిళలపై దాడులు చేసిన దుష్టులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళ నాయకులు డి.కళ్యాణి, ఎ.అజయకుమారి కూడా మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, నేతలు బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, కె.ఝాన్సీలక్ష్మి, కేతా గోపాలన్, ఎం.ఆంజనేయులు, కూసంపూడి సుబ్బరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, పిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: మణిపూర్‌లో మారణహోమాన్ని నిరసిస్తూ ఐక్య క్రైస్తవ సంఘ నాయకులు చేపట్టిన నిరసన, శాంతి ర్యాలీకి సిపిఎం నేతలు సంఘీభావం తెలిపారు. పట్టణంలో పాస్టర్ వై.రూబెను ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ ఐక్య క్రైస్తవ సంఘాలు చేపట్టిన ర్యాలీకి సిపిఎం, ముస్లిం మైనారిటీ సంఘం నాయకులు సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. అనంతరం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పొగాకు నారాయణరావు, జల్లి రామ్మోహన్, బొక్కా శ్రీనివాస్‌రావు, రామాంజనేయులు, యడ్ల చిట్టిబాబు, మంచిలి నీలకంఠం, క్రైస్తవ నాయకులు నళిని జాన్‌కుమార్, శ్యామల శరత్, ఇంజేటి జాన్‌కెనడీ, నల్లిమిల్లి జోసెఫ్, సికిలి పర్సిపాల్, రత్నరాజు, ముస్లిం నాయకులు మౌలానా హిమ్రాన్, ఖజామీన్, ఎమ్‌డి.షాజహాన్ పాల్గొన్నారు.



నరసాపురం: వినతి అందిస్తున్న నేతలు

కళ్ల సంరక్షణపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కళ్ల సంరక్షణపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ నేత్ర వైద్యురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రసాద్ అండ్ కో, సాగి రామకృష్ణంరాజు ఇంజినీరింగ్ కళాశాల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చినఅమిరం గ్రామ ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఇటువంటి శిబిరాల సమయంలో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మారుతున్న పరిస్థితులు, పౌష్టికాహారం లోపం వల్ల ఎక్కువ శాతం మంది కంటి వ్యాధికి గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన కళాశాలలో జరిగిన సాగి రామకృష్ణంరాజు 90వ జయంతి సందర్భంగా ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేషన్, ప్రసాద్ అండ్ కో సంయుక్త ఆధ్వర్యంలో సాగి రామకృష్ణంరాజు జన్మస్థలం చిన అమిరంలో ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు, ఆ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. అందులో భాగంగా గ్రామస్తులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య, కెఎన్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హింసలేని సమాజం కోసం 'మహిళల పోరుయాత్ర'

పోస్టర్లను ఆవిష్కరించిన ఐద్వా నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

హింసలేని సమాజం కోసం 'మహిళల పోరుయాత్ర' జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మజ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.ఉదయకుమారి, జిల్లా కోశాధికారి ఎస్.జయప్రభ పిలుపునిచ్చారు. భీమవరంలో బస్సు యాత్ర పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలపై హింస రోజురోజుకీ విపరీతంగా పెరుగుతుందన్నారు. హింసను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మిమర్శించారు. మహిళలపై ఎన్నో దాడులు జరుగుతున్నా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చూపిస్తున్నాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు యువత జీవితాలు ఓపక్క నాశనం అవుతుంటే, మత్తు పదార్థాల మాఫియాలకు ప్రభుత్వాలే అండగా నిలబడటం అత్యంత విషాదమని అన్నారు. మహిళలపై హింసను అరికట్టే దిశగా నేరాలను అధ్యయనం చేయటానికి నిపుణులతో కమిటీ వేయాలని కోరారు. మద్యం, మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించాలని తదితర డిమాండ్స్‌తో ఆగస్టు 5న ఏలూరులో జరిగే సభకు యువకులు, మహిళలు, విద్యార్థులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు శారద, యశోద పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరించిన నేతలు

కొల్లేరుకు వరద

ఉధృతంగా ప్రవహిస్తున్న సర్కారు కాలువ

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేరు సరస్సుకు వరద ఉధృతి కొనసాగుతోంది. కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ గుడికి వెళ్లే దారిలో సర్కార్ కాలువపై ఉన్న వంతెన వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. కర్రల వంతెన మరమ్మతులకు గురికావడంతో వాహనాల రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. కేవలం పాదచారులు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని చెప్పారు. కొల్లేరులో నాటు పడవలపై ప్రమాదకర ప్రయాణాలు సాగించొవద్దని ఆయన సూచించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలన్నారు.



సర్కార్ కాల్వ వద్ద పోలీసు పహారా

పాలకొల్లులో భారీ ఈదురుగాలులు

ప్రజాశక్తి - పాలకొల్లు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తగ్గినప్పటికీ పాలకొల్లులో శనివారం భారీ ఈదురుగాలులు వీచాయి. వర్షం లేకపోయినా ఉదయం నుంచి భారీ ఈదురుగాలులు వీచాయి. అయితే మరో అల్పపీడనం పొంచి ఉందని చెప్పడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉద్యోగ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు తప్ప మరో మార్గం లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. మార్టేరులో శనివారం నిర్వహించిన సిఐటియు జిల్లా వర్క్‌షాపు శనివారం ముగిసింది. రెండోరోజు రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు ఆగస్టు సెప్టెంబరు నెలల్లో ఆందోళనకు పిలుపునిచ్చాయని, ఈ ఆందోళన కార్యక్రమాల్లో జిల్లాలోని ఆయా రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలపై ఉక్కుపాదం మోపిందన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి కనీస వేతనాలు రూపొందించడంలో, పిఎఫ్ ఇఎస్ఐ వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో, ఆయా పని ప్రదేశాల్లో పరిశ్రమల్లో ఇతర సౌకర్యాలు కల్పించడం వంటి వాటిని పూర్తిగా గాలికి వదిలేసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ ఉత్సవ విగ్రహంగా మారిపోయిందన్నారు. తనిఖీలు చేయడం, చర్యలు తీసుకోవడం వంటివి ఈ కాలంలో ఎక్కడా కనిపించడంలేదన్నారు. కొన్ని రంగాల్లో కార్మికుల శ్రమ నుంచి వచ్చిన నిధులను కూడా ప్రభుత్వం పక్కదారి పట్టించి కార్మికుల సంక్షేమాన్ని నీరు కార్చే విధానం మనం చూస్తున్నామన్నారు. వీటన్నిటిలోనూ మార్పు రావాలంటే పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ సంఘాల నిర్వహణకు నిధుల సేకరణ, అకౌంట్స్ నిర్వహణ క్రమపద్ధతిలో జరగాలని వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు రెండు రోజులపాటు జరిగిన జిల్లా వర్క్‌షాపులో పాల్గొని సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కర్రి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.రంగారావు, పివి.ప్రతాప్, అజయ్‌కుమారి, కె.ఝాన్సీలక్ష్మి, డి.కళ్యాణి, ఎం.ఆంజనేయులు, తెలగం శెట్టి సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు పాల్గొన్నారు.

రోడ్డున పడుతున్నా.. పట్టించుకోరేం..!

ప్రకృతి ప్రకోపం.. పాలకుల విధానాల శాపం ఫలితంగా వివిధ తరగతుల ప్రజలు రోడ్డున పడుతున్నా.. రోడ్డెక్కుతున్నా ఈ ప్రభుత్వాలు పట్టించుకోకపోగా జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గోదావరి వరదలు నదీ పరివాహక ప్రాంతాల ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తూ పునరావాస కేంద్రాలకు తరలేలా చేస్తుంటే.. భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. తమ విధులు.. నిధుల సంగతేంటంటూ సర్పంచులు ఆందోళనబాట పట్టినా అటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మౌనం వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గోదావరి మళ్లీమళ్లీ కన్నెర్రజేస్తోంది. గతంలో మాదిరిగానే విలీన మండలాల ప్రజలతోపాటు ధవళేశ్వరం దిగువన ఉన్న లంక గ్రామాల ప్రజలను వణికిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పెరుగుతూ.. తగ్గుతూ.. మళ్లీ అనూహ్యంగా పెరుగుతూ గోదారమ్మ అందరినీ బెంబేలెత్తిస్తోంది. గత సంవత్సరం మాదిరిగానే ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఊళ్లొదిలి పునరావాస కేంద్రాలకు రావాలని చెప్పడం మినహా పెద్దగా సహాయక చర్యలు చేపట్టిన దాఖలాల్లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి నిదర్శనమే పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు ముంపు ప్రాంతాల పర్యటనకు వెళ్తే బాధితులు అడ్డుకోవడం. ఇప్పటికీ ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాల కల్పన అనేది పూర్తిగా నిలిపివేసింది. రోడ్లు అడుగు తీసి అడుగు వేయలేని స్థితికి మారగా గ్రామాల్లోనూ లెక్కలేనన్ని సమస్యలు పేరుకుపోయాయి. ప్రభుత్వం చెబుతున్నట్లు ముంపు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు అనవసరం అనుకుంటే అక్కడున్న ప్రజలకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన పరిహారం, ప్యాకేజీ, పునరావాసం త్వరితగతిన పూర్తి చేసి వారిని అక్కడి నుంచి తరలిస్తే వరదల గురించి ఆందోళనే ఉండదు. ప్రభుత్వం, అధికారుల హడావుడీ కూడా అవసరం ఉండదు. ప్రభుత్వం చేయాల్సిన పని చేయకపోగా కనీసం వరదలు చుట్టుముడుతున్నా తూతూమంత్రంగా పునరావాస కేంద్రాలకు తరలించి చేతులు దులుపుకోవడంపై అంతా పెదవి విరుస్తున్నారు. ఇదేనా సిఎం జగన్ చెబుతున్న మానవతాదృకృథం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సిఎం, ప్రభుత్వం పదేపదే తమపై దయతో.. జాలితో వరదల నుంచి ఆదుకుంటున్నట్లు చెప్పనవసరం లేదని, బటన్ నొక్కి పునరావాస పరిహారం, ప్యాకేజీ అందిస్తే తామే గ్రామాలు ఖాళీ చేస్తామని నిర్వాసితులు ఘంటాపథంగా చెబుతున్నారు. అప్పటి వరకైనా తమను నిలువునా ముంచేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించేసి సరిపెట్టకుండా బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు వంటివన్నీ సమకూర్చాలని, ప్రధానంగా తాగునీరు అందించాలని వరద బాధితులు వేడుకుంటున్నారు. లేనిపక్షంలో ఎంఎల్‌ఎ బాలరాజుకు ఎదురైన అనుభవమే ఇతర ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎదురైనా ఆశ్చర్యపోనవసరం లేదని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. మరి ప్రభుత్వం, అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.



ఇక వర్షాలు ఉమ్మడి జిల్లావాసులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా దిగ్బంధించాయి. ఎడతెరిపి లేని వర్షాలతో గ్రామాలు.. పట్టణాల్లో పారిశుధ్యం క్షీణించింది. ప్రధానంగా అవుట్‌లెట్లు లేకపోవడం, మురుగుపారుదల వ్యవస్థను పట్టించుకోకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ నీట మునిగి రవాణా వ్యవస్థ స్తంభిస్తోంది. ఆ నీటిలో ప్రయాణం చేస్తే గుంతల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు ఈ సంవత్సరమూ కనీసం రోడ్ల మరమ్మతులు చేపట్టకపోగా వర్షాకాలం ముందు మార్జిన్లలో చేపట్టే జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో రోడ్లపైనే వర్షపునీరు నిలిచిపోతుంది. కొన్ని ప్రాంతాల్లో మార్జిన్లు ఎత్తుగా ఉండగా, కొన్ని ప్రాంతాల్లోనైతే మార్జిన్లు కానరాని విధంగా మొక్కలు, పొదలు పెరిగినా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఫలితంగా రోడ్లు మరింత దెబ్బతినడంతో వాహనదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తలకు దెబ్బ తగలకుండా హెల్మెట్ సరే.. కాళ్లు, చేతులకు రక్షణ ఏమిటని పోలీసు సిబ్బందిని ద్విచక్ర వాహనదారులు ప్రశ్నిస్తున్నారంటే జనం ఎంత విసిగిపోయారో అర్థమవుతోంది. దీనికితోడు భారీ వర్షాలతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. జనం బతుకులను రోడ్డున పడేసిన ఈ పాలకులు ఇప్పటికైనా రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో ప్రజలే ఈ పాలకులను రోడ్డున పడేసే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఇక పంచాయతీ సర్పంచులు అంతా రోడ్డెక్కారు. తమ విధులు, నిధులు హరించడం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టిన సర్పంచులు మండల పరిషత్ తదితర సమావేశాలను వేదిక చేసుకుని తమ ఆవేదన వెళ్లగక్కుతున్నారు. కనీసం చిన్నపాటి పని కూడా చేసే పరిస్థితి లేకుండా నిధులన్నీ రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంటోందని, కనీసం తమ విధులు సైతం సరిగ్గా నిర్వర్తించనీయకుండా అధికార పార్టీ నేతలు హల్‌చల్ చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులైన సర్పంచులతోపాటు అధికార పార్టీ మద్దతుదారులైన సర్పంచులు సైతం గళమెత్తుతుండటం గ్రామాల్లో అధికార పార్టీ అరాచకాలకు, నియంతృత్వానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవచ్చు. స్థానిక సంస్థల బలోపేతం పేరిట గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా సచివాలయాలు ఏర్పాటు చేశామని చెబుతున్న వైసిపి ప్రభుత్వం మరి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల విధులు, నిధుల్లో ఎందుకు జోక్యం చేసుకుంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మారకపోతే గ్రామాలు మరిన్ని సమస్యల సుడిలో కూరుకుపోయి ప్రజలే ప్రభుత్వంపై కన్నెర్రజేసే పరిస్థితులు పొంచి ఉన్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు జనాన్ని రోడ్డున పడేసే విధానాలు వీడకపోతే కచ్చితంగా ఈ పాలకులను ప్రజలే రోడ్డున పడేస్తారనేది రాజకీయ పరిశీలకుల అంచనా.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్



శ్రీరంగనాథరాజు సత్కరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ దంపతులు

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్‌ను కోరిన ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్‌ను ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరారు. చెరుకువాడ శ్రీరంగనాథరాజును ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రంగనాథరాజు స్వగృహంలో జెడ్‌పి చైర్‌పర్సన్ దంపతులు పుష్పగుచ్ఛం మెమొంటో అందించి శ్రీరంగనాథరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రంగనాథరాజు జెడ్‌పి చైర్‌పర్సన్‌కు అభినందనలు తెలిపి మాట్లాడారు. జిల్లా పరిషత్‌ను, ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు పాల్గొన్నారు.

భీమవరంలో చంద్ర విద్యాసాగర్ వర్ధంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రముఖ నాట్యాచారులు వెంపటి చినసత్యం, ప్రముఖ సంఘ సంస్కర్త రచయిత మహోపాధ్యాయులు ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ తెలుగు పండితులు కలిగొట్ల గోపాలశర్మ, కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ చెన్నైలో భరతనాట్యమే విరాజిల్లుతున్న తరుణంలో కూచిపూడి నృత్య సంప్రదాయాన్ని చెన్నై కళాభిమానులకు పరిచయం చేసి, భరతనాట్యం చెంతన కూచిపూడికి దీటైన స్థానాన్ని చినసత్యం సంపాదించి పెట్టారన్నారు. 2011లో హైదరాబాదులో 2,800 మంది కళాకారులతో ఏకకాలంలో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి నృత్య కార్యక్రమానికి గిన్నిస్ రికార్డు వచ్చిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మహిళలు కూడా విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించాలని విద్యాసాగర్ పోరాటలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, కొండ్రు శ్రీనివాస్, పులపర్తి శ్రీను పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ద్రోహి జగన్ : టిడిపి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి హయాంలో చంద్రబాబు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనేక ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.21,442 కోట్లు ఖర్చు చేయగా జగన్ తన నాలుగేళ్ల పాలనలో రూ.4,375 కోట్లు మాత్రమే ఖర్చుచేసి ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయలేకపోయారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉఉత్తరాంధ్రాలో వైసిపి దోచేసిన రూ.40 వేల కోట్లతో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయవచ్చున్నారు. ఉత్తరాంధ్రాలోని వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణ పెన్నా నదులతో రాష్ట్రంలోని మొత్తం 69 నదులను అనుసంధానం చేయగలిగితే దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తామన్న వైసిపి విశాఖలోని ఋషికొండకు గుండు కొట్టి అధికార దౌర్జన్యాలతో విశాఖపట్నం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నికల కోసం వేచి చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఓడించనున్నారని తెలిపారు.

సేవా అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని సమాజంలో ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేస్తున్న వారి సేవలను గుర్తించి, వారిని ఆదర్శ అవార్డులతో సత్కరిస్తున్నట్లు ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రొక్కాల నాగ బుజ్జి తెలిపారు. ఆగస్టు ఏడో తేదీ లోపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న వారిని ఎంపిక చేసి వారికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సేవ, మదర్ థెరిసా సేవ, విలియం కేరి సేవ, అబ్దుల్ కలాం సేవ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 6305683467 వాట్సాప్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓటు హక్కు వినియోగం సామాజిక బాధ్యత అని, ఓటు నమోదు నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర వెనుకబడిన తరగతుల బాలుర హాస్టల్ వార్డెన్ కడలి శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఇధ్వర్యంలో ఓటు నమోదు-ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వార్డెన్ శ్రీనివాస్ మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన ప్రతిపౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు ఏ ప్రాంతంలో ఉన్నా ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసి ఓటు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. అనంతరం పోలీస్ బొమ్మ సెంటర్ నుంచి విద్యార్థులతో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.నాగమోహన్, పి.రాజబాబు, చక్రవర్తి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

విశాఖ జిల్లా సింహాచలానికి చెందిన పూసపాటి వెంకటకృష్ణంరాజు, మానస దంపతుల కుమారుడు వివేక్ పేరున పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ చేతులమీదుగా అందించారు. వారికి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

తాడేరు వంతెన నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తాడేరు వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రూ.2.30 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణంలో ప్రస్తుతం స్లాబ్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను శనివారం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు. పునుల వేగవంతంగా జరగడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఇ రామరాజు, వన్‌టౌన్ జెసిఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, నామన మహేష్, యర్రంశెట్టి కొండ, మట్టా ఏసు పాల్గొన్నారు.

'నదుల అనుసంధానం ఘనత చంద్రబాబుదే'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో నదులు అనుసంధానం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వలవల బాబ్జీ మాట్లాడారు. చంద్రబాబునాయుడు హయంలో నదుల అనుసంధానం చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామంగా మార్చారన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను 72 శాతం పూర్తి చేసి ఇస్తే వైసిపి పాలనలో పూర్తి అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. రివర్స్ టెండర్ల పేరుతో ప్రాజెక్ట్ నిర్మాణ పనులను ముందుకు సాగనివ్వలేదన్నారు. నాలుగేళ్ల కాలంలో నాలుగు శాతం మాత్రమే పనులు పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, తాడేపల్లిగూడెం మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, డిసిసిబి మాజీ అధ్యక్షులు దాసరి అప్పన్న, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు పాతూరి రామప్రసాద్ చౌదరి, ఎస్.కృష్ణమోహన్, ఎస్‌కె.బాజీ, ఎరుబండి సతీష్, ముత్యాల శ్రీనివాస్, పసలపూడి రాంబాబు, మాలపూడి మహేష్ పాల్గొన్నారు.

మా కాలనీలో సమస్యలు పరిష్కరించరూ..!

అరుంధతిపేటవాసుల ఆవేదన
అధ్వానంగా సామాజిక మరుగుదొడ్లు
వెలగని వీధిలైట్లు, అందని తాగునీరు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని రామన్నపాలెం పంచాయతీలో అరుంధతిపేటవాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో వారు వాపోతున్నారు. సామాజిక మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. దీంతో మహిళలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్లు పగిలిపోయి దుర్వాసన వస్తుందని, మరుగుదొడ్లకు తలుపులు కూడా పాడైపోయాయని వార్డు మెంబర్ వాపోతున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదని, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శలు చేస్తున్నారు. పంచాయతీలో సర్పంచులు, పైన పాలకులు, అధికారులు మారుతున్నారు తమ సమస్యలకు మాత్రం పరిష్కారం లభించడంలేదని ప్రజలు వాపోతున్నారు. కాలనీలో వీధిదీపాలు వెలగడంలేదని, డ్రెయినేజీ సదుపాయం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



పగిలిని పైపులైను చూపిస్తున్న వార్డు మెంబర్




అధ్వానంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లు

తాగునీరు కూడా లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని, కాలనీలో వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, డ్రెయినేజీ నిర్మించాలని, తాగునీరు అందించేలా చూడాలని కాలనీవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

విస్సాకోడేరు గ్రామాభివృద్ధికి కృషి : పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. విస్సాకోడేరు సచివాలయం-2 పరిధిలో సర్పంచి బొల్ల శ్రీనివాస్, మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ముగిసింది. దీనిలో భాగంగా సర్పంచి బొల్లా శ్రీనివాస్ ఇటీవల గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు సిమెంట్ రహదారులను పివిఎల్, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు చంటిరాజుతో కలిసి ప్రారంభించారు.



పివిఎల్‌ను ప్రజాప్రతినిధులను సత్కరించిన గ్రామస్తులు

ఈ సందర్భంగా పంచాయతీ వార్డు సభ్యులు పెరుమాళ్ల వీరన్న, ముద్రాసులుపాలెంవాసులు ఆధ్వర్యంలో పివిఎల్, ఎంపిపి, సర్పంచి, మాజీ సర్పంచులతో పాటు సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతిరాజు వంశీకృష్ణమరాజు, ఎంపిటిసి సభ్యులు బొల్లం గాంధీ, వైసిపి ముఖ్య నేత దుండి అశోక్ బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ముఖ్య నేత పిన్నమరాజు పృథ్వీరాజు, ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీతులసి, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు గడ్డం జోషి, సామాంతపూడి మారాజుబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత : వైసిపి

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల ఆరోగ్యమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ స్పష్టం చేశారు. కొడమంచిలి పంచాయతీలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ అధిక వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా జ్వరాలు గాని, ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని కోరారు. గ్రామంలో ఎక్కడా కూడా ఏ విధమైన ఆరోగ్య పరంగా సమస్యలు రాకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది పర్యటించి ఎవరికీ ఏవిధమైనా ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, రూపాంజలి, రాశి, ఎఎన్ఎంలు పుష్ప రాజ్యం, వెంకటరమణ, ఆశా కార్యకర్తలు పాల్గున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని వావిలాల సరళాదేవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఇది ఉపాధి కల్పిస్తుంన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. 30 మంది దరఖాస్తు చేశారని వీరికి రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తారని చెప్పారు. లయన్స్ అసిస్టెంట్ గవర్నర్ ఎన్‌విఎస్.పాపారావునాయుడు, కెబి.ఫణీంద్రుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.అన్నపూర్ణ, కార్యదర్శి, ఎం.నారాయణరావు, నందుల రమణి, డివివి.సత్యనారాయణ, కొమ్ముల శ్రీలక్ష్మి, సునీత, డాక్టర్ కల్యాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - తణుకు రూరల్

వర్షాకాలంలో వచ్చే అన్ని వ్యాధులకు నివారణ మందులు ఆరోగ్య కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని డాక్టర్ టిఎల్ఎస్.హరిణి అన్నారు. వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దువ్వ గ్రామంలో వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ జ్వరాల నివారణపై అవగాహన సదస్సు దువ్వ ఆరోగ్య సహాయకులు ఎంపి.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగీ నివారణపై అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్, గ్రామాల్లో క్షేత్రస్థాయిలో హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జాతీయ ఉపాధి హామీ చట్టం సహాయకులు హనుమంతు, కూలీల నాయకులు కొడవటి వీరయ్య, కూలీలు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండుగ సందర్భంగా పేదలకు సహాయం చేయటం ఎంతో ఆనందంగా ఉందని భీమవరం ఇండియన్ బ్యాంక్ మేనేజర్ పున్నం నిశాంత్ సాహితి దంపతులు అన్నారు. మండల కేంద్రమైన ఉండి మసీదులో శనివారం ఎన్ఎస్.ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధినేత నిశాంత్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఈ ట్రస్ట్‌ను ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పొన్నం శ్రీను, మసీద్ గురువు హర్షద్‌అహ్మద్, షేక్ బాజీ, షేక్ సిద్ధయ్య పాల్గొన్నారు.

లంక గ్రామాల ప్రజలను ఆదుకుంటాం

ప్రజాశక్తి - ఆచంట

గోదావరి ఉధృతి కారణంగా జలదిగ్బంధంలో చిక్కుకున్న లంక గ్రామాల ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం మధ్యాహ్నం వశిష్ట గోదావరి కోడేరు నుంచి లైఫ్ జాకెట్లతో ఇంజన్ పడవపై మర్రిమూల, అయోధ్యలంక, పుచ్చలంక, రాయిలంక, పెద్దపేట నుంచి భీమలాపురం వరకు పర్యటించి లంక గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు అవసరం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. పశువులకు కూడా గడ్డి సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, నాయకులు మొల్లేటి రామకృష్ణ, అయోధ్యలంక సర్పంచి, కడలి కృష్ణవేణి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



లంక గ్రామాల్లో పర్యటిస్తున్న ఎంఎల్‌ఎ రంగనాథరాజు

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

పాలకొల్లు రూరల్ : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ గుణ్ణం సుజయశ్రీ చెప్పారు. మండలంలోని ఉల్లంపర్రులో పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెటర్నల్, చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుజయశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహారపు నియమాల గురించి వివరించారు. బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలకు అందించే ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 50 మంది గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. వారందరికీ రోటరీ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు పౌష్టికాహార కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇమ్మిడి రాజేష్, మాజీ ప్రెసిడెంట్ మద్దాల రాంప్రసాద్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, చందక రాము, కానూరి ప్రభాకరరావు, పోతాబత్తుల సత్యనారాయణ, శిరిగినీడి రాము, రోటరీ సభ్యులు ఎఎన్ఎం.భాగ్యలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా వసుధ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలోని అల్లూరి సీతారామరాజు వైద్య సేవ సహాయ కేంద్రంలో వసుధ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 45 శాఖల ద్వారా విద్య, వైద్య, ఉపాధి సేవా కార్యక్రమాలను వసుధ ఫౌండేషన్ నిర్వహిస్తుందన్నారు. వృద్ధులు, అనాథలు, వికలాంగుల సంక్షేమం కోసం ఆశ్రమాలకు 400 సేవా సంస్థల ద్వారా సహాయం అందిస్తుందన్నారు. 500 విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, మంచినీటి సౌకర్యం కల్పించిందన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు పుట్టినరోజున ఫౌండేషన్ ప్రారంభమైందన్నారు. వైద్య సహాయ కేంద్రానికి వచ్చిన వారికి పండ్లు, రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఎంవి.రామరాజు, వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యం : రవికుమార్



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

సిఎం జగన్ పారదర్శక పాలనకు ఆకర్షితుడనై సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి రాజకీయంలోకి వచ్చి సేవ చేయాలనే సంకల్పంతో వైసిపిలో చేరుతున్నట్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పెంకి రవికుమార్ తెలిపారు. ఉండి చిక్కాల వీరన్ననగర్ కాలనీలోని పోలేరమ్మ స్టేజి వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పెంకి రవికుమార్ ఆధ్వర్యంలో 25 మంది యువకులు పివిఎల్.నరసింహరాజు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారిని పివిఎల్.నరసింహరాజు సాదారంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు మాట్లాడుతూ చిక్కాల వీరన్ననగర్ కాలనీలో ఉండి గ్రామ దేవత పోలేరమ్మ జాతరకు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో రవికుమార్ తన కుటుంబ సభ్యుల సహకారంతో కళా మండపాన్ని నిర్మించడమే కాకుండా, కార్యాలయాన్ని కూడా నిర్మించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో పార్టీ ఎంఎల్‌ఎ లేకపోయినప్పటికీ సిఎం జగన్ సూచనల మేరకు పార్టీలకతీతంగా పారదర్శకంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు ఆదర్శంగా నిలిచారన్నారు. పివిఎల్.నరసింహరాజు ఆదేశాల మేరకు గ్రామంలోని పార్టీ నాయకుల సమన్వయంతో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రవికుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, ఉండి ఉపసర్పంచి గొట్టుముక్కల కల్యాణ వర్మ, నాయకులు రణస్థుల మహంకాళి, ఏడిద వెంకటేశ్వరరావు, ధనుంజయ, శివనాగరాజు, కమతం బెనర్జీ, వెంకటాచార్యులు, అంగర రాంబాబు, రాయి సతీష్, శేషాద్రి శ్రీనివాస్, బడుగు బాలాజీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1984-85 పదో తరగతి విద్యార్థులు శనివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. మొదటి రోజు జరిగిన సమ్మేళనం కార్యక్రమానికి గులిపల్లి సత్యనారాయణ, పూడివలస సత్యనారాయణ, పాలా శ్రీనివాసరావు, పాలా దుర్గారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రెండోరోజు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి కీర్తిశేషులు తమ స్నేహితుల ఆత్మ శాంతికి కొంతసేపు మౌనం వహించనున్నట్లు తెలిపారు.

చెరువులను తలపిస్తున్న జగనన్న కాలనీలు : జనసేన

ప్రజాశక్తి - పెనుమంత్ర

నెగ్గిపూడి పంచాయతీ పరిధిలో వనంపల్లిలో జగనన్న కాలనీ కాలువను తలపిస్తోందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాష్ విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కాలనీవాసులు ఈ దుస్థితిలో ఉండడానికి అధికారులు, పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్, ఆచంట మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ, పెనుమంత్ర మండల కార్యవర్గ సభ్యులు షేక్ మహ్మద్ అలీ, వినుకొండ తేజస్ రామానాయుడు, భావన చందు, పట్నాల రవి, లంకే రవి, పొలుపర్తి నాగశ్రీను, షేక్ అనీఫ్, గ్రామ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : జగనన్న కాలనీలను చెరువులను తలపిస్తున్నాయని, లబ్ధిదారులకు కన్నీళ్లే మిగిలాయని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు (చినబాబు) అన్నారు. భీమవరం పంపుల చెరువు వద్ద జగనన్న కాలనీని శనివారం జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. అక్కడ ఉన్న ఇద్దరు లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం చినబాబు మాట్లాడుతూ జగనన్న కాలనీలు చేపల చెరువులను తలపిస్తున్నాయని, లే అవుట్ చేసి ఇళ్లు ఇస్తామని మోసం చేశారన్నారు. ఒక్క రోడ్డు తప్ప ఎటువంటి మౌలిక వసతులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్నమల్ల చంద్రశేఖర్, బండి రమేష్‌కుమార్, సుంకర రవి, కత్తుల నీలేంద్ర, పద్మ, శ్యామల, మీనాక్షి, పూర్ణిమ, పుప్పాల సుబ్బారావు, అప్పారావు, జూలూరి వెంకీ, శ్రీను పాల్గొన్నారు.

పోడూరు : మండలంలో జగనన్న కాలనీలను జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి రావి హరీష్‌బాబు సందర్శించారు. గుమ్మలూరు, పోడూరు, పండితవిల్లురు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కడలి శ్రీనివాస్, తోలేటి వేణు పాల్గొన్నారు.

పాలకొల్లు : శివదేవుని చిక్కాల సమీపంలో జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను జనసేన పట్టణ అధ్యక్షుడు శిడగం సురేంద్ర పరిశీలించారు. 43 ఎకరాల ఇళ్ల పట్టాల స్థలంలో కేవలం పది ఎకరాలు మాత్రమే పూడ్చారని, మిగతా ప్రాంతమంతా మోకాలు పైనే లోతు నీటిలో మునిగి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పినిశెట్టి అంజి, మంచిగంటి మారుతీ, సాధనాలు దుర్గబాబు, తులా రామలింగేశ్వరరావు, నల్లమోతు ప్రసాద్ పాల్గొన్నారు.

అందరికీ సొంతిల్లు ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో ప్రతిఒక్కరూ సొంతిల్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో సిఎం జగన్ పని చేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దిరుసుమర్రు గ్రామానికి చెందిన 39 మంది లబ్ధిదారులకు స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ గ్రంధి పవన్‌కుమార్, సర్పంచి కోళ్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

'టిడిపితోనే మహిళలకు సముచిత స్థానం'

ప్రజాశక్తి - పోడూరు

మహిళలకు సముచిత స్థానాన్ని ఇచ్చి గౌరవించడం టిడిపితోనే సాధ్యమని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని కొమ్ముచిక్కాల గ్రామంలో శనివారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి వివరిస్తూ కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామమోహన్‌రావు, టిడిపి నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చేట్టి చంద్రమౌళి, మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మహిళ నాయకురాలు కర్నేన రోజారమని, ఎంపిటిసి సభ్యులు విప్పర్తి శారద, నాగరాజు సుజాత, ద్రాక్షరపు జ్యోతి, నాగలక్ష్మి, బుజ్జి, దాసరి రత్నరాజు పాల్గొన్నారు.

వీరవాసరం : సంక్షేమంతో పాటు ప్రతి కుటుంబం ఆదాయం పెంచడమే టిడిపి లక్ష్యమని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి అన్నారు. టిడిపి మహిళా విభాగం మహాశక్తి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ మేనిఫెస్టో ప్రచార కార్యక్రమాన్ని నందమూరుగరువులో శనివారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రొంగల కృష్ణవేణి, ఎం.నారాయణమ్మ, మాదాసు కనకదుర్గ, సయ్యద్ ససీమాబేగం, బి.పద్మ, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు, కడలి వాసు పాల్గొన్నారు.

ఉండి : టిడిపితోనే మహిళలకు భరోసా ఉంటుందని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ అన్నారు. మండలంలోని చినపుల్లేరు గ్రామంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వత్సవాయి సుజాత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో కన్నెగంటి రూత్ కళ పాల్గొని మాట్లాడారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబును గెలిపిస్తే మహిళలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కిన్నెర వెంకన్న, చిన్నపుల్లేరు మాజీ సర్పంచి రంపా సౌలు రాజు, రామభద్రరాజు, కృష్ణంరాజు, కట్టా రాంబాబు, కాగిత వెంకట సత్యనారాయణ, వేగేశ్న అనంతలక్ష్మి పాల్గొన్నారు.

శాంతి ప్రదర్శనకు తరలిన క్రైస్తవులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల నుంచి క్రైస్తవ సోదరులు నరసాపురంలో శనివారం నిర్వహించిన శాంతి ప్రదర్శనకు తరలివెళ్లారు. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై, చర్చిలపై జరుగుతున్న దాడులకు నిరసనగా నరసాపురంలో శాంతి ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని పాలపర్తివారిపేట ప్యారిస్ వన్ చర్చ్ ఫాదర్ గోడి యోసోబు రాజు ఆధ్వర్యంలో పలువురు సంఘస్తులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు.

కౌన్సిలర్ సస్పెండ్ సరికాదు : జనసేన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నియోజకవర్గంలో అధికార పార్టీ చేసే అక్రమాలను ప్రశ్నించారనే కారణంగా జనసేన పార్టీకి చెందిన నరసాపురం పట్టణ 22వ వార్డు కౌన్సిలర్ భారతి సురేష్‌ను మున్సిపల్ సమావేశాల నుంచి రెండు నెలలు సస్పెండ్ చేశారని జనసేన నియోజకవర్గ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కౌన్సిలర్‌ని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. భారతిసురేష్‌కు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.